వర్మీ కంపోస్టు ఉత్పత్తిని పెంచాలి



పాత కంపోస్టుయార్డులో వర్మీ కంపోస్టు యూనిట్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: ఉక్కాయపల్లె వద్దనున్న పాత కంపోస్టు యార్డులో వర్మీ కంపోస్టు ఉత్పత్తిని మరింత మెరుగు పరచాలని కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం ఆయన కంపోస్టు యార్డును తనిఖీ చేసి నీటి సౌకర్యం కల్పించాలని, ఎంఆర్ఎఫ్ షెడ్, వేయింగ్ మెషీన్ మరమ్మతులును తక్షణమే చేయించాలని ఆదేశించారు. క్లాప్ వాహనాల్లో కెమెరాలకు మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. గాంధీ పార్కులో చిన్నారులకు ఆట పరికాలు, ఇసుకను ఏర్పాటు చేయాలని సూచించారు.అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ రవీంద్రనాథ్ రెడ్డి, డీఈ అబిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

గాంధీనగర్ ఉన్నత పాఠశాల తనిఖీ...

కడప నగరంలోని గాంధీనగర్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ తనిఖీ చేశారు. మంగళవారం ఆయన స్కూల్‌ను తనిఖీ చేసి పదవ తరగతి విద్యార్థులకు సోషల్ పాఠాలు బోధించారు. పాఠాలను సులువుగా గుర్తుంచుకునే విధానాన్ని వివరించారు. పాఠశాలలో మ్యూజిక్ రూం ఏర్పాటు చేయాలని, పిల్లలు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లో ఆసక్తి కలిగేలా చూసుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థుల కోసం ప్రేరణ పుస్తకాలను పంపిణీ చేశామని, విద్యార్థులు వాటిని ఐదుసార్లు కంఠస్థం చేస్తే పదవ తరగతిలో మంచి ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం ఎలా ఉంటుందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

22న విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

కడప కల్చరల్ : స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ఈనెల 22వ తేదిన నగరంలోని విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించనున్నట్లు రాయలసీమ టూరిజం అండ్‌కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు తెలిపారు. స్థానిక రాజీవ్ మార్గ్‌లోని రెడ్డిసేవా సమితి కార్యాలయంలోఈనెల 22న ఉదయం 8.00 గంటలకు ఈ పోటీ ప్రారంభిస్తామని తెలిపారు. విద్యార్థులు స్వాతంత్ర్య సమరంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పాత్ర అనే అంశంపై పోటీలో మాట్లాడవలసి ఉంటుందన్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులను జూనియర్లుగా, ఇంటర్మీడియేట్ విద్యార్థులను సీనియర్లుగా పరిగణిస్తామని, ఒక్కొక్కరికి మూడు నిమిషాల వ్యవధిమాత్రమే ఉంటుందని, రెండువిభాగాల్లోనూ ప్రథమ, ద్వితీయ, బహుమతులుతో పాటు అవసరమైన మేరకు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని వివరించారు. పాఠశాలల యాజమాన్యం ఒక్కొక్క పాఠశాలనుంచి కేవలం 10మందిని మాత్రమే పంపాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 98491 97044 నెంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

జగనన్న ప్రభుత్వానికి అండగా నిలవాలి

కడప కార్పొరేషన్: జగనన్న ప్రభుత్వానికి పట్టభద్రులు అండగా నిలవాలని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి కోరారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ ఆడిటోరియంలో గృహసారథులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రచారం చేశారు. అనంతరం రిమ్స్ హాస్పిటల్‌లోని ప్రతి విభాగానికి వెళ్లి డాక్టర్లు, ఉద్యోగులు, గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి కరపత్రాలు పంచి ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఆ తర్వాత కలెక్టరేట్‌లోని అన్ని బ్లాకలలో, అన్ని డిపార్ట్‌మెంట్లలో ఉద్యోగులను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. సాయిక్రిష్ణ స్కూల్‌లో కూడా ప్రచారం చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి, వేయించి జగనన్నను బలపరచాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రమణ, ప్రతాప్‌రెడ్డి, ఎన్. వెంకట్రామిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, మల్లేశ్వర, చంద్రశేఖర్‌రెడ్డి, రాము, ప్రసాద్ పాల్గొన్నారు.

అమర సైనికులకు అశ్రు నివాళి



అమర వీరులకు సంస్మరణగా కొవ్వొత్తుల ర్యాలీ

కడప కల్చరల్ : పుల్వామా సంఘటనలో వీరమరణం పొందిన భారత జవానులకు సంస్మరణగా మంగళవారం కడప నగరంలో పలు స్వచ్ఛంద సంస్థలు ర్యాలీ నిర్వహించాయి. స్థానిక ఆశారేఖ ఫౌండేషన్ చైర్మన్ నెమలిదిన్నె నాగవేణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం కోటిరెడ్డిసర్కిల్ వద్ద ప్రారంభమైంది. సాయంత్రం 7.00 గంటలకు వందలాది మంది ఎన్‌సీసీ కేడెట్లు, స్వచ్ఛంద సంస్థలు, చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ అధికారి పద్మ పర్యవేక్షణలో కేడెట్లు క్రమశిక్షణాయుతంగా ఎర్రముక్కపల్లె సెంటర్‌లోని అమర వీరుల స్మారక స్థూపం వద్దకు చేరారు. జై జవాన్...అమర వీరుల త్యాగాలు మరువలేం అంటూ స్థూపం చుట్టూ చేరి నినాదాలు చేశారు. అనంతరం అధ్యాపకులు పుల్వామా సంఘటన నేపద్యాన్ని మన సైనికులు ప్రదర్శించిన ధీరత్వాన్ని కొనియాడారు.

మహాశివరాత్రికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

– ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహా శివరాత్రిని పురస్కరించుకుని శైవ క్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప డివిజన్ పరిధిలోని శైవ క్షేత్రాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారన్నారు. దేవదాయశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని భక్తులకు స్వామి వారి దర్శనం సజావుగా జరిగేలా చూడాలన్నారు. అలాగే పారిశుద్యం విషయంలో సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పలువురు తహసీల్దార్లు, ఎంపీడీఓలు, అగ్నిమాపకశాఖ, ఆర్‌డబ్ల్యుఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్ల నియంత్రణకు కృషి చేయాలి

– అనుడ వైస్ చైర్మన్ వై ఓ నందన్



సదస్సులో మాట్లాడుతున్న అనుడ వైస్ చైర్మన్

కడప కార్పొరేషన్: అన్నమయ్య అర్బన్ అర్బన్ డెవెలప్‌మెంట్ అథారిటీ(అనుడ) పరిధిలో అక్రమ లే అవుట్లు, అనధికార నిర్మాణాల నియంత్రణకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని అనుడ వైస్ చైర్మన్ వై ఓ నందన్ కోరారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ హాలులో ఆన్‌లైన్ బిల్డింగ్ ప్లాన్ అనుమతి ప్రక్రియపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పంచాయతీలలో 300 చదరపు మీటర్ల కంటే తక్కువ వైశాల్యం ఉన్న బిల్డింగ్ ప్లాన్ అనుమతి ప్రక్రియకు సంబంధించి ఎంట్రో ల్యాబ్ వారిచే అభివృద్ధి చేసిన వెబ్ అప్లికేషన్‌పై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. 300 చ.మీ కంటే ఎక్కువ వైశాల్యం ఉన్న బిల్డింగ్ ప్లాన్ అప్లికేషన్లు అనుడ కార్యాలయానికి వస్తాయన్నారు. భవన నిర్మాణ ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో తీసుకురావడం వల్ల పారదర్శకత పెరుగుతుందని, అనుమతి తీసుకునే ప్రక్రియ సులభతరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓలు ఆసిఫ్, క్రిష్ణసింగ్, డీఎల్‌పీఓ షేక్ మస్తాన్ వలీ, ఎంపీడీఓలు, ఈఓలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ల ప్రైవేటీకరణ తగదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ బస్టాండ్ల ప్రైవేటీకరణ తగదని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ తెలిపారు. మంగళవారం కడప ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దశలవారీగా ఆర్టీసీ బస్టాండ్లను ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు లీజు ప్రాతిపదికన కట్టబెట్టే చర్యలను చేపడుతోందన్నారు. ముఖ్యమంత్రి, ఆర్టీసీ చైర్మన్ ఇద్దరూ జిల్లా వాసులేనని, ప్రైవేటు వ్యక్తులకు బస్టాండ్లను కట్టబెట్టే విధానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. సీపీఎం నాయకులు దస్తగిరిరెడ్డి, చంద్రారెడ్డి, ఓబులేశు, మహబూబ్‌తారా, రాజామణి, సరిత, శివ, రియాజ్, అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నాం

ప్రయాణికులకు మెరుగైన, సౌకర్యవంతమైన వసతులు కల్పించాలన్న ఉద్దేశ్యంతో పులివెందుల బస్టాండును నిర్మించి ప్రారంభించామని కడప ఆర్టీ సీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముద్దనూరు,ఎర్రగుంట్ల బస్టాండ్లను ఆధునీకరించడం జరిగిందన్నారు. ప్రొద్దుటూరు బస్టాండు నిర్మాణంలో ఉందన్నారు. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంతో మైదుకూరు, జమ్మలమడుగు, డిపోల బస్టాండ్లను ఆధునీకరించే దిశగా నిర్మాణం చేపట్టాలని ఆలోచిస్తున్నామన్నారు. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలన్న ఆలోచనతోనే ఈ ప్రాజెక్టును చేపట్టామని.. ప్రైవేటీకరణచేయాలన్న ఉద్దేశ్యం లేదని ఆయన వివరించారు.

దామోదరం సంజీవయ్యకు నివాళి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య గొప్ప దార్శనికుడని డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాస రావు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య బడుగు, బలహీన వర్గాల ఉన్నతి కోసం ఎంతో కృషి చేశారన్నారు. బండి జకరయ్య, సత్తార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు సాగు నీటి ప్రాజెక్టుల పరిశీలన

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులను బుధవారం సీపీఐ బృందం పరిశీలించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం రాజోలి ఆనకట్ట, బ్రహ్మంసాగర్, వామికొండ రిజర్వాయర్, సర్వరాయ సాగర్, వెలిగల్లు ప్రాజెక్టును పరిశీలిస్తామన్నారు. ఈ మేరకు సాగు నీటి ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను నీటి పారుదల శాఖ అధికారులతో చర్చించామన్నారు. ఈ ప్రాజెక్టుల పరిశీలనకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేసు, ఈశ్వరయ్య, హరినాథ్ రెడ్డితో పాటు పలువురు వస్తున్నట్లు తెలిపారు.

అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా గంగా సురేష్



కడప వైఎస్ఆర్ సర్కిల్: అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా గంగా సురేష్ ఎన్నికయ్యారు. ఈ నెల 11,12 తేదీల్లో గుంటూరు జిల్లా తెనాలిలో అభ్యుదయ రచయితల సంఘం 19వ రాష్ట్ర మహాసభలో ఈ మేరకు ఎన్నుకున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

తైక్వాండో క్రీడాకారులకు అభినందన



తైక్వాండో క్రీడాకారులను అభినందిస్తున్న అఫ్జల్‌ఖాన్ తదితరులు

కడప స్పోర్ట్స్: ఇటీవల తిరుపతి నగరంలో నిర్వహించిన 1వ ఓపన్ సౌత్‌జోన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో కడప నగరానికి చెందిన పలువురు క్రీడాకారులు పతకాలు సాధించారు. నగరంలోని మున్సిపల్ ఉర్దూ హైస్కూల్‌లో శిక్షణ పొందిన 16 మంది పతకాలు సాధించినట్లు తైక్వాండో కోచ్ జంషీర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి టి.కె. అఫ్జల్‌ఖాన్ అభినందించారు. మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జమాల్‌వలి తదితరులు పాల్గొన్నారు.

దర్గా స్థలం పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

– సమావేశంలో అఖిలపక్ష నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న చంద్ర

కడప రూరల్: కడప మోచంపేటలోగల రఖీబ్ షావలీ దర్గా స్థలం పరిరక్షణకు చర్యలు చేపట్టాలని అఖిలపక్ష నేతలు చంద్ర, బాబుభాయ్, అమీర్‌బాబు, సయ్యద్ సలావుద్దీన్ తెలిపారు.మంగళవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన అఖిలపక్ష నేతల సమావేశంలో వారు మాట్లాడారు. రఖీబ్ షావలీ దర్గాకు సంబంధించి అక్కడ స్థలం ఉందన్నారు. ఈ స్థలం పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మొయినుద్దీన్, బాదుల్లా, రామ్మోహన్, మహమ్మద్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

18న మహాశివరాత్రి వేడుకలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 17, 18న మహాశివరాత్రి సందర్భంగా నగర శివార్లలోని 45వ డివిజన్ ఊటుకూరు గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు గోసుల సుబ్బారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న ఉదయం శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ, హోమం, అభిషేకం 18న ఉదయం శివునికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. 10.45 గంటలకు శివ పార్వతులకు కళ్యాణం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం ఉత్సవ మూర్తులు ఊరేగింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

అసంఘటిత కార్మికులకు అటల్ పెన్షన్ యోజన వరం

కడప కార్పొరేషన్: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వారికి అటల్ పెన్షన్ యోజన ఒక వరం లాంటిదని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ రాకేష్ కశ్యప్ అన్నారు. మంగళవారం ఏపీజీబీ ప్రధాన కార్యాలయంలో అటల్ పెన్షన్ యోజన ఔట్ రీచ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఈ పథకం అమలవుతున్న తీరును వివరించారు. ఏపీజీబీ దేశంలోనే అత్యున్నత పనితీరును కనబరుస్తోందన్నారు. పీఎఫ్ఆర్‌డీఏ ఏజీఎం మోహిత్ యాదవ్, జీఎం జగదీశ్వరరావు, స్టేట్ మేనేజర్ బాలభాస్కర్, రీజినల్ మేనేజర్లు పాల్గొన్నారు.

బంగరు భవితకు బడిబాట



బడిబయట పిల్లలను సీఎస్ఐ స్కూల్లో చేర్పిస్తున్న సీఆర్‌పీలు

కడప ఎడ్యుకేషన్: బడిబయట బాల బాలికలకు బడిబాట ద్వారానే బంగారు భవిష్యత్తు ఉంటుందని సీఆర్‌పీలు ఆదిమూలం శంకర్, కృష్ణ, రామ్మోహన్ అన్నారు. రాష్ట్ర, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్రశిక్ష , కడప మండల విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం కడప మండల సీఆర్‌పీలు ×మన బడికి పోదాం× కార్యక్రమంలో భాగంగా బడి బయట పిల్లల్ని బడిలో చేర్పించడం కోసం నగరంలోని నాగరాజుపేట ప్రాంతంలో పర్యటించి ఇద్దరు బడిబయట పిల్లలను గుర్తించారు. వారిని సిఎస్ఐ హైస్కూల్‌నందు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుదేవి సమక్షంలో వారి వయసుకు అనుగుణంగా తరగతిలో చేర్చారు. బడి వయసు గల బాలబాలికలను బడికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు నాగమణికుమారి, జమీలున్నీసా, పర్జానాబేగం, హజారాభాను, సువర్ణ, మంగమ్మ, వెంకటాద్రి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాటాలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని కార్మికుల సమస్యలపై పోరాటాలు చేపడతామని ఆర్‌సీపీ సీనియర్ నాయకులు లింగమూర్తి, రాష్ట్ర కార్యదర్శి ఎన్. రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీకే కళ్యాణ మండపంలో రాయలసీమ ట్రేడ్ యూనియన్ జిల్లా మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ, ఆటో, విద్యుత్, హమాలీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్మికులకు నిధిని ఏర్పాటు చేసి భవన నిర్మాణ కార్మికులను అన్ని విధాలుగా అదుకోవాలన్నారు. కార్యక్రమంలో రాయలసీమ ట్రేడ్ యూనియన్ నాయకులు సిద్దరామయ్య, శేఖర్, మగ్బూల్ బాషా, బాల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫేస్ యాప్ రద్దు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని వీఆర్ఎలకు ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని వీఆర్ఎల సంఘం యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు బి.మనోహర్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్ఎలకు గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. వీరికి కనీస వేతనం చెల్లించాలన్నారు. గ్రామాల్లో చాలా మంది వీఆర్ఏలు చదువు రాని వారు ఉన్నారని వీరికి ఫేస్ యాప్‌ను పెట్టడం ద్వారా తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. అర్హులైన వీఆర్ఎలకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. అనంతరం డీఆర్వో గంగాధర్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, సుంకర రవి, వీఆర్ఎల సంఘం నాయకులు నాగేంద్ర, నాగేష్, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ సబ్‌సెంటర్ అభివృద్ధికి చర్యలు

– సీఏవైడీ ప్రతినిధులు



నందలూరు సబ్‌సెంటర్‌ను పరిశీలిస్తున్న సీఏవైడీ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్: క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) పరిధిలోని నందలూరు క్రికెట్ సబ్ సెంటర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని సీఏవైడీ ఆపరేషన్స్ డైరెక్టర్ ఎస్. ఖాజామైనుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం నందలూరులోని క్రికెట్ సబ్‌సెంటర్‌ను సీఏవైడీ ప్రతినిధుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా నందలూరు సబ్‌సెంటర్ నిర్వాహకులు పలు ప్రతిపాదనలను సీఏవైడీ ప్రతినిధులకు అందజేశారు. సబ్‌సెంటర్‌లో సిమెంట్ పిచ్, నూతన నెట్ ఏర్పాటు, గడ్డి తొలగింపు తదితర చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన సీఏవైడీ ప్రతినిధులు మాట్లాడుతూ నందలూరు నుంచి పలువురు క్రీడాకారులు ఇప్పటికే రాష్ట్రస్థాయి పోటీల్లో రాణిస్తున్నారన్నారు. మరింత మంది క్రీడాకారులు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రికెట్ సంఘం ప్రతినిధులు పైడికాల్వ విజయ్‌కుమార్, అబ్దుల్ ఫరూఖ్ రెహమాన్, కె. విష్ణుమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యూసీఐఎల్ సామాజిక బాధ్యత

– రూ. 35 లక్షల సీఎస్ఆర్ ఫండ్ చెక్కు కలెక్టర్‌కు అందజేత

కడప సిటీ : వేముల మండలంలోని యురేనియం కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) సంస్థ జిల్లా అభివృద్ధి కోసం రూ. 35 లక్షల ఆర్థికసాయం అందించి తమవంతు సామాజిక బాధ్యతను చాటుకుంది. మంగళవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లోని కలెక్టర్ విజయరామరాజును కలిసిన యూసీఐఎల్ సంస్థ ప్రతినిధులు ఈచెక్కును ఆయనకు అందజేశారు.కలెక్టర్‌ను కలిసి వారిలో యూసీఐఎల్ ప్రతినిధులు జీఎం ఎంఎస్ రావు, డిప్యూటీ జీఎం సంజయ్ చటర్జీ, సీఎస్ఆర్ అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి, కో ఆర్డినేటర్ గంగిరెడ్డి తదితరులు ఉన్నారు.

టీడీపీ నాయకులు స్థాయి తెలుసుకొని మాట్లాడాలి

- కార్పొరేటర్లుగా గెలవలేని వారు కూడా సవాళ్లు చేయడమా!
- ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్ మండిపాటు



మాట్లాడుతున్న ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్ కుమార్, తదితరులు

కడప కార్పొరేషన్: తెలుగుదేశం పార్టీ నాయకులు తమ స్థాయి తెలుసుకొని మాట్లాడాలని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్ కుమార్ హితవు పలికారు. మంగళవారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్పొరేటర్లుగా కూడా గెలవలేని వారు ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషాను చర్చకు రావాలని సవాల్ విసరడం హాస్యాస్పదమన్నారు. స్థాయి లేనివారి మాటలకు జవాబు చెప్పకపోతే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయనే ఉద్దేశ్యంతోనే స్పందిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ భిక్షతో కో ఆప్షన్ మెంబర్ అయిన ఎంపీ సురేష్‌కు డిప్యూటీ సీఎంను విమర్శించే స్థాయి ఉందా అని ప్రశ్నించారు. జిల్లా ప్రజలు టీడీపీ ఓట్లు వేయలేదనే అక్కసుతో వారు ఈ జిల్లాను పూర్తిగా విస్మరించారన్నారు. దివంగత వైఎస్సార్ వల్లే ఈ జిల్లా అభివృద్ధి చెందిందని, ఆయన మొదలు పెట్టి 90 శాతం పూర్తి చేసిన బుగ్గవంక ప్రహరీగోడ పనులను కూడా టీడీపీ ప్రభుత్వం పూర్తి చేయలేదన్నారు. జగనన్న ప్రభుత్వం కడపకు చేసిన అభివృద్ధిపై తాము ఎప్పుడైనా చర్చకు సిద్ధమేనన్నారు. అంతకుముందు వారు కడపలో జరుగుతున్న అభివృద్ధి అబద్ధమని నిరూపించాలన్నారు. టీడీపీ నేతలతో చర్చకు వైఎస్సార్‌సీపీలో చిన్నస్థాయి కేడర్ చాలన్నారు. నోటిని అదుపులో ఉంచుకొని విమర్శలు చేయాలని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ వినోద్ కుమార్, త్యాగరాజు, బండి ప్రసాద్, కె. బాబు, చెన్నయ్య, బండి మరియలు, శ్యాంసన్, పి. సంపత్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రచారం నిర్వహిస్తున్న ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు

వైవీయూ: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో లభిస్తున్న కోర్సులు, సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల అధ్యాపకులు కోరారు. మంగళవారం కడప ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు పెండ్లిమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో లభించే కోర్సులు, సదుపాయాలపై ప్రచారబాట నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు నాగరాజు, రాజీవ్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉండే కోర్సులతో పాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్ సేవలు అదనంగా ఉన్నాయన్నారు. అధ్యాపకులు సత్యనారాయణరెడ్డి, డా. రేఖ, పర్వీన్ పాల్గొన్నారు.

విజయదుర్గాలయంలో రాహుకాల పూజలు



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : ఆ విశాలమైన ప్రాంగణంలో మధ్యాహ్నం రెండు గంటలకే మహిళా భక్తులు కిటకిటలాడారు. ఆయమ్మను మనసారా కోరుకుంటే శుభాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. ఆమె సన్నిధిలో రాహుకాల పూజల కోసం మంగళవారం మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. పలువురు మగవారు కూడా పూజల్లో పాల్గొన్నారు. కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో ప్రతి మంగళవారంలాగానే ఈసారి కూడా రాహుకాల పూజలు నిర్వహించారు. భక్తుల సంఖ్య ఊహించని విధంగా పెరగడంతో ఆ ప్రాంగణంలో చోటు చాలలేదు. రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు. వచ్చే మంగళవారం శ్రావణమాసం ప్రారంభమై ఉంటుంది గనుక భక్తులు భారీగా వచ్చే అవకాశం ఉందని ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కవిత

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కవిత తెలిపారు. మంగళవారం నగరంలోని పాత రిమ్స్‌లోగల ఆదరణ నిరాశ్రయుల వసతి గృహంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అనాథలు, అభాగ్యులు, బిక్షాటన చేసే మహిళలు, పురుషుల కోసం, రోడ్డు పక్కన, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, బహిరంగ ప్రదేశాల్లో నివసిస్తున్న మహిళలు, పురుషుల కోసం వివిధ ప్రాంతాల నుంచి వైద్య సేవలకు పట్టణానికి వచ్చే నిరుపేదల కోసం ఉచిత నిరాశ్రయుల వసతి గృహాలను ఏర్పాటు చేశామన్నారు. వీటిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలనిసూచిస్తూ సీనియర్ సిటిజన్ టోల్‌ఫ్రీ నెంబరు 14567పై అవగాహన కల్పించారు.

సెప్టిక్ వ్యర్థాలను సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్దే వదలాలి

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో ఇళ్లలోని సెప్టిక్ ట్యాంకుల నుంచి ఉత్పత్తి అయ్యే ద్రవవ్యర్థాలను నానాపల్లె సమీపంలో ఉన్న సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్దనే వదలాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం నగరపాలక సంస్థ అనుమతించిన వాహనాలను మాత్రమే వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కడపను గార్బేజ్ ఫ్రీ సిటీగా మార్చేందుకు ప్రతి గృహస్తుడు తమ ఇంట్లో ఉత్పత్తి అయ్యే ఘన వ్యర్థాలను తడి, పొడి, హానికరమైన చెత్తలుగా విభజించి నగరపాలక సంస్థ వాహనాలకు ఇవ్వాలన్నారు. తమ ఇంట్లో ఉత్పత్తి అయ్యే వంటింటి వ్యర్థాల నుంచి హోం కంపోస్టు తయారు చేసుకోవాలన్నారు. నగరపాలక పరిధిలో నిర్మాణ, కూలిన వ్యర్థాలను అనుమతించిన వాహనాలలో తగిన రుసుము చెల్లించి తరలించుకోవాలని సూచించారు.